# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

# కట్టమింద దేవర

"ఇంగ రెండు జాములకి పొద్దు మొలిస్తుంది" అనింది నగిరింటి దీపం.

"ఇంగొక్క జాము ఎదురుచూసి గోపినింటిదాని మింద ఆశ వదులు కోవాల్సిందే!" అనింది పెద్దింటి దీపం.

"ఇంగా... ఒగ జాము ఎదురుచూడాల్నా?" అనింది మూతి అదోరకంగా పెట్టి చిలకముక్కు దీపం.

"రాత్తిరంతా ఎదురుచూసినదానివి ఇంగొక్క జాము ఎదురు చూడలేవా?' ఆలోపు ఒక కత చెప్తాను. ఆఖరి కత" అనింది పెద్దింటి దీపం.

* * *

కొత్తచెరువు కింద వరిమళ్ళు కోతకొచ్చినాయి. ఈపొద్దో రేపో కట్ట మింద దేవర చేసి కోతలు మొదలెట్టాలి.

గొర్రైలతాత మంచంమింద కుర్చోని బీడీ తాగతా వుంటే వచ్చినాడు కొత్తచెరువుకింద నీళ్ళు పారగట్టే మాదిగ కొండన్న.

''ఏమిరా ఇట్లా వచ్చినావు?'' అని చెప్పి నడుముకి చుట్టుకున్న సింగితం తీసి బీడీ ఒకటి ఇచ్చినాడు. దోసిలిపట్టి బీడీ తీసుకున్నాడు కొండన్న.

''కట్టమింద దేవర చెయ్యాల్లగదా!'' అన్నేడు బీడీ ముట్టించి.

''అందరి దగ్గిర దుడ్లు వసూలుచెయ్యి. చేద్దాము'' అన్నేడు గొర్రైల తాత.

''మీతో ఒగమాట చెప్పి వసూలికి పోదామని వస్తి'' అన్నేడు.

ఆ మాటతో పక్క జేబిలోనుంచి నూట పదహార్లు తీసి ఇచ్చినాడు.

దోసిలిపట్టి తీసుకోని పైకిలేసినాడు కొండన్న.

''ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా? సుక్కురారం కొత్తచెరువు కట్టమింద దేవర చేస్తా వుండారు. రైతులందరు రావాలి. రైతుల్ని నమ్ముకోని వుండే కుమ్మరి, మంగలి, చాకలి, మాలమాదిగలంతా రావాలి'' అని చెప్పి బుదారం సంతలో వీరతిమ్మిగోడు 'డంటనకడంటనక' అని పలక కొడతా దండోర వేసినాడు.

సుక్కురారం కంటే ముందే పొయ్యి, కట్టె కంపా కొట్టి దావచేసి కట్టమింద దేవర చేసుకునే దానికి వీలుగా అరువు చేసివచ్చినారు రాజన్న, వెంగట్రవణ చిన్నాయన, సక్కు పిన్నమ్మ, రామాంజుల వదిన పొయ్యి పేన్నీళ్ళు చల్లి, పేడతో అలికి, ఎర్ర మన్నుతో పట్టీలు తీసి, ముగ్గులేసి వచ్చినారు.

సుక్కురారం పొద్దున్నే రెడ్డోరిపల్లె నుంచి చాకలి వెంకటప్పన్న, చిన్నక్క వచ్చినారు. కుమ్మరి వేమ సిద్దు కొత్తకుండల్ని పట్టుకోని వచ్చినాడు.

పరవాణ్ణం వండడానికి కావలసిన పప్పు, బియ్యం, బెల్లం ఇచ్చింది కల్లేణమ్మ. కట్టమిందకు పొయ్యి కొత్తకుండలు కడిగి పసుపు కుంకాలు పెట్టి, మూడురాళ్ళు పెట్టి పొయ్యి వెలిగించింది చిన్నక్క.

వెంకటప్పన్న మూడురాళ్ళు తీసుకోని వచ్చి సుబ్బరంగా నీళ్ళతో కడిగినాడు. పసుపు పూసి, కుంకుమ బొట్లు పెట్టినాడు. తంగేడు చెట్టుకింద ఆ మూడు రాళ్ళని నిలబెట్టినాడు.

ఒగరాయి కట్టమింద దేవర, ఇంగొకరాయి పోలి దేవర, మూడోరాయి గంగ.

చిన్నక్క పరవాణ్ణం వండేసింది. ఆ పరవాణ్ణం సట్టికి వేపాకుల దండ కట్టింది.

ఆపాటికి చుట్టుపక్కల పల్లెల నుంచి ఒక్కరొక్కరుగా రావటం మొదలెట్టినారు.

గొర్రైల దొడ్డిలో నుంచి కొమ్ములు తిరిగిన పొట్టేలుని పట్టుకున్నాడు గొర్రైలతాత. నుదురుమింద, వొట్టి కాళ్ళమింద పసుపు కుంకాలు పెట్టింది చిన్నవ్వ. పొట్టేలు మెళ్ళో చెండు మల్లెపూల దండేసినారు.

బాటకాడ మాదిగపల్లె నుంచి పలకలు, కొమ్ములు ఎత్తుకోని మాదిగోళ్ళు వచ్చినారు. వాళ్ళు వస్తావస్తా సాయిబులపల్లెలో ముక్కల దాక



సారాయి తాగివచ్చినారు.

వరిగడ్డి మంటేసి పలకల్ని వెచ్చ చేసుకున్నేరు.

ఊగతా, తూగతా,

అడుగులో అడుగేస్తా 'జెజ్జినక జెజ్జినక' అని పలకలు కొడతా వుంటే దిక్కులు దొని పలకతా వుండాయి.

వీరతిమ్మగోడు తుడము కొడతా వుంటే ఏడేడు లోకాలు ఊయలూగతా వుండాయి.

కనవోరిపేట నుంచి మంగలోళ్ళు వచ్చినారు. అన్న డోలు కొడతా వుంటే, తమ్ముడు 'తూ...' అని మేళం ఎత్తుకున్నేడు.

మాదిగోళ్ళ పలకలకి, మంగలోళ్ళ మేళానికి పొంతనే లేదు. ఎవరిదారి వాళ్ళదే.

వెంగటప్పన్న దివిటి వెలిగించినాడు.

మెరవణి మొదలైంది. ఇంటింటి ముందు పొట్టేల్ని నిలబెట్టి, ఇత్తడి బిందెతో నీళ్ళు వరపోస్తా వుండారు. హారతులు ఇస్తా వుండారు. పొట్టేలికి నానబియ్యం, బెల్లం తినిపిస్తా వుండారు.

మెల్లంగా మెరవణి కొత్త చెరువు కట్టమిందకు చేరుకొనింది.

ఆపాటికే చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చిన జనంతో ఇసికేస్తే రాలనంతగా పొట్టపితక్కొచ్చి నట్టు వుండాది.

కొత్తొడ్లతో వండిన అన్నాన్ని కుంభంపోసినారు. ఆ కుంభం మింద పసుపు కుంకాలు చల్లి, మద్దెన కడ్డీలు వెలిగించినారు. సుడులు తిరగతా పొగ పైకి లేసి పలవరిస్తా వుండాది.

తీంట్ర ఆకుల్లో వండిన పరవాణ్ణాన్ని మూడు పల్లేలు వేసినారు.

ఆకూ వక్కా పెట్టి, కప్పూరం వెలిగించి టెంకాయ కొట్టినాడు గొర్రెల తాత.

ఆ పాట్నే పొట్టేలిని లాక్కోనిపొయ్యి బొమ్మలకి ఎదురుగా నిలబెట్టినారు. వెంకటప్పన్న వేటకొడవ లిని చేతపట్టుకున్నాడు.

హారతిని పైకెత్తినాడు గొర్రెలతాత. ఒకరి బుజా లమింద ఒకరు చేతులు చాపి హారతి కళ్ళకద్దుకు న్నారు.

అప్పుడు వేట కొడవలి పైకెత్తి,

కొడవలి పిడికున్న మువ్వలు ఘల్లున మోగంగా ఒక్క వేటుకి పొట్టేలు తల నరికినాడు వెంకటప్పన్న.

ఆ తలని బొమ్మల ముందు పెట్టి నీళ్ళు వరపో సినారు.

"గంగమ్మ తల్లీ చెప్పు? వానలు పడతాయి గదా? పంటలు పండతాయి గదా? మా గాదెలు నిండుతాయి గదా?" అంటా పొట్టేలు తలని పలి కించినారు.

ఆ పొట్టేలు తల మూడుసార్లు నోరు తెరిచి మూస్తే నిజం చెప్పిందని సంతోసపడతారు.

ఆపాట్నే మాదిగ కొండన్న మొండెం నుంచి కారతా వుండే నెత్తురుని దబరనిండా పట్టుకున్నేడు. నెత్తురుకూడు కలిపినాడు.

పొట్ట చీలకోసి పేగులు మెళ్ళో వేసుకున్నేడు

"పొలోపొలి ... పొలోపొలి" అంటా ఆ నెత్తురు కూడుని వరి పొలాల మింద చల్లినాడు.

ఆ మరుసటిరోజు నుంచి కొత్తచెరువు కింద కోతలు మొదలెట్టినారు.

పెదబ్బవాళ్ళు కూడా కక్కరకొడవళ్ళు చేతబట్టి వరిమళ్ళల్లోకి దిగినారు. పెదబ్బకి కొత్తగదా! కోస్తా కోస్తా వేలు తెగ్గోసుకున్నేడు. నెత్తురు బొటబొటా కారింది.

"నెత్తురు కారడం మంచిదే. నేల శాంతగిస్తుంది. పుట్టెడు వొడ్లు ఎక్కువ రాలుతాయి" అన్నేడు గొర్రె లతాత. చిన్నవ్వొచ్చి గాయానికి సున్నం పెట్టింది.

వరిమళ్ళు కోసి వాదిలేసినారు. మోపులు కట్టి పెద్దత్త వాళ్ళ చేనుకాడ వుండే బండమింద కుప్పలే సినారు.

రాత్తిరిపూట గొర్రెల తాత, పెదబ్బ పొయ్యి బండమింద కావలి పడుకున్నేరు.

ఆకాశం మిలమిలా చుక్కల్ని పూసింది.

"ఆకాశంలో ఎన్ని చుక్కలుంటాయి తాతా?" అని అడిగినాడు పెదబ్బ.

"ఎన్ని వుంటాయో ఎవరికి తెలుసు? ఆ వడ్లరా శిలో ఎన్ని వడ్ల గింజలుంటాయో ఎట్లా లెక్కకట్టి చెప్పేది? కానీ పెదబ్బ! ప్రెతి వొడ్లగింజమింద, ఇది మాదిగోని సొత్తు, ఇది మంగలోని సొత్తు, ఇది చాక లోని సొత్తు, ఇది ఎలకల సొత్తు, ఇది చీమల సొత్తు అని దేముడు రాసిపెట్టి వుంటాడంట. రేపు కుప్ప కొట్టినాక ఎవడి భాగం వాడు పట్టకపోతాడు" అని





చెప్పినాడు గొర్రెలతాత.

''ఇవ్వకపోతే ఏమయితింది?'' అని అడిగినాడు పెదబ్బ.

''ఇవ్వకపోతే ఏమయితిందా? ఒగసారి రైతు ఇట్లనే పడుకోని, ఆకాశంలో చుక్కలు లెక్కిస్తా, కష్టపడి నేను పంట పండించినాను. వీళ్ళందరికి నేనెందుకు భాగాలు పెట్టాలి? ఇది నా సొత్తు అని మొండికి తిరిగినాడు. ఆ సమచ్చరం వానలు కురవలేదు. పంటలు పండలేదు.''

అప్పుడు రైతు వానదేవుడి దగ్గరకు పొయ్యి,

''వానదేవుడా! వానదేవుడా! ఎందుకు నువ్వు వానలు కురిపించలేదు'' అని అడిగినాడు.

''నేను కష్టపడి నీకెందుకు వానలు కురిపించాలి? నాకేం పని లేదా?'' అని కసురుకున్నేడు వానదేవుడు.

అప్పుడు అర్థమయింది రైతుకి.

''ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలుపంచుకోవాలి అని. ఆరోజు నుంచి రైతు ఎప్పుడూ నేనెందుకు భాగం పెట్టాలి? ఇది నా సొత్తు అనకుండా ఎవరి భాగం వాళ్ళకి పంచిపెట్టేవాడు'' అని కత చెప్పినాడు గొర్రెలతాత.

ఆ తర్వాత మూడు రోజులకి వరి కుప్పలు ముగ్గిపోయినాయి.

కుప్ప కొట్టేదానికి మోపులు తీస్తావుంటే ముగ్గు వాసన వెచ్చవెచ్చగా పలవరించింది.

అనుమంతునాయుడు, రాజన్న, ఎంగట్రవణ చిన్నాయన, మాదిగ కొండన్న లాంటి బలమైన మనుషులు వాదిలు వాదిలుగా తీసుకోని కుప్పకొడతా వుంటే వడ్లు జలజలా రాలిపోయినాయి.

దూరంగా కనిపించే ఆదిశేషుడి కొండలు మాదిరి మద్దెనాలకి వొడ్లు రాశులు పడిపోయినాయి.

ఆ రాశుల్ని బొజ్జత్త, చిన్నవ్వ, సక్కు పిన్నమ్మ చేటలతో తూరుపెత్తినారు.

మాపటేలకి చాకలోళ్ళు, మంగలోళ్ళు, కుమ్మరోళ్ళు సంచులెత్తుకోని వచ్చేసినారు. సాయిబుల పల్లె నుంచి పెట్ట ఇబ్రామ్ తాత మురుకులు, బోండాలు, సుగీలు, బిసకత్తులు, పిప్పరమెంట్లు, ఊపురుబుడ్డలు గంపకెత్తుకోని ఆడదాని మాదిరి కులకతా, చేతులు తిప్పతా వచ్చినాడు.

ఆ తాతని ఏవేవో గొబ్బు మాటలతో పలకరిస్తా ఎగతాళి చేసినారు.

చేటడు వొడ్లు పోసి పెదబ్బకి ఇష్టమైన సుగీలు, ఊపురు బుడ్డలు తీసిచ్చింది చిన్నవ్వ.

శేరు చేతపట్టి మేరవొడ్లు కొలవడం మొదలెట్టినాడు అనుమంతునాయుడు.

మంగలోళ్ళు, చాకలోళ్ళు, కుమ్మరోళ్ళు ఒక్కరొక్కరుగా మేరవొడ్లు ఎత్తుకోని పొయినారు.

మిగిలిన వడ్లని మూటలు కట్టి బండికెత్తినారు.

ఇంట్లో గాదెలు నిండిపొయినాయి. గాదెల్లో మూలస్తానమ్మ కొలువైంది.

పొద్దుగూకతానే ఆముదం ఆకులో పేడని ముద్దచేసి, ఆ ముద్ద మీద ప్రెమిద పెట్టింది. నూనెలో వత్తివేసి దీపం వెలిగించింది కల్లేణమ్మ.

దీపానికి పసుపు కుంకుమ పెట్టింది.

కొత్తొడ్లతో వండిన పరవాణ్ణాన్ని పల్లెమేసింది. కడ్డీలు వెలిగించి పేడ ముద్దకి చెక్కింది.

కప్పూరం వెలిగించి టెంకాయి కొట్టింది.

మొదటి ముద్దని కుక్కకి వేసింది. అది తినేసి మళ్లా ఎగచూసింది.

''ఏందిమల్లా ఆశిస్తా వుండావే'' అని చెప్పి వూదనబుర్ర తీసుకోని ఇసిరింది. అది 'కుయ్యో కుయ్యో'మంటా తోక వూపతా వీధిలోకి పరిగెత్తింది.

''కుక్క ఆశ గుండ్రాయితో పొయింది అనేసి సాటవ చెప్పింది ఇందుకే'' అని నవ్వింది కల్లేణమ్మ.

పరవాణ్ణం ముద్దలు చేసి పెద్దావుకి పెట్టింది. మొగిలి గోడమింద ఒక ముద్ద గువ్వలకి పెట్టింది.

పెదబ్బకి, పీరుబాబుకి, వసంతకి పరవాణ్ణం పెట్టింది. గిన్నెతో ఆ పరవాణ్ణం మింద నెయ్యి పోసింది. వేడికి కరిగిపొయ్యి గమగమా పలవరించింది. కొత్తొడ్ల పరవాణ్ణంది భలే రుచి.

పల్లెంలోనుంచి ఒక మెతుకుని చీమ ఒకటి ముక్కున కరుచుకోని కిందమింద పడతా ఎత్తుకోని పోతావున్నింది.

పెదబ్బ చూసినాడు.

''అవా... అవా... చీమ చూడు. మెతుకు ఎత్తుకోని పోతా వుండాది'' అని చూపించినాడు.

''దాని సొత్తు అది ఎత్తుకోని పోతా వుండాది. దేవుడు ముందుగానే రాసిపెట్టుంటాడు ఏది ఎవరికి చెందాలనేది'' అని చెప్పింది చిన్నవ్వ.

★

## మెరుపుతీగ పెరిజాద్

ఈ మధ్యనే సినిమాల్లో తళుక్కుమంటున్న మెరుపుతీగ పెరిజాద్ జొరాబియన్. 'మార్నింగ్ రాగా' సినిమాలో పెరిజాద్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఇరానీ కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి ఎంబిఏ చదువుకుని న్యూయార్క్‌లోని యాక్టింగ్ స్కూల్‌లో చేరింది. న్యూయార్క్ కంటే ముంబయ్ అంటేనే తనకిష్టమంటుంది. ఎందుకంటే ముంబై ఒక కలల నగరమట. తన కలేమిటని అడిగితే ఎప్పటికప్పుడు మారుతూ వుంటాయని గడుసుగా చెబుతోంది.